అభివృద్ధి, సంక్షేమంలో పోటాపోటీ

- మండలంలో రూ.310.9 కోట్ల అభివృద్ధి
- రూ.450.86 కోట్లతో సంక్షేమ పథకాలు
- చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పనులు



గ్రామంలో వేసిన నూతన రోడ్డు

పొదలకూరు : మండలంలో 2019 నుంచి 2023వ సంవత్సరం వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అమలయ్యాయి. ప్రతి పంచాయతీలో మౌలిక వసతుల కింద రోడ్లు, సైడ్‌డ్రెయిన్లు, సచివాలయ, ఆర్బీకే, నాడు–నేడు పాఠశాలల భవనాల నిర్మాణాలు జరిగాయి. సంక్షేమ పథకాల పేరుతో ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అంది పేదల జీవన విధానంలో మార్పు వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రతి కుటుంబం రూ.4 నుంచి రూ.6 లక్షల లబ్ధి పొందారు. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించే వారు తప్పించి మిగిలిన వారంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారే. ముఖ్యంగా మహిళలు ఆసరా, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన, వసతీదీవెన పథకాల ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయడం జరిగింది. వివిధ పథకాల ద్వారా ఎందరో అర్హులైన వారు లబ్ధిపొందారు.

మండలంలో..

సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు మండలం విస్తీర్ణంలో పెద్దది కావడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విస్తారంగా అభివృద్ధి పనులు చేపట్టారు. 23 సచివాలయాల పరిధిలో అభివృద్ధికి రూ.310.9 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.45.86 కోట్ల నిధులు వెచ్చించారు. మొత్తం రూ.761.76 కోట్లు ఒక్క మండలంలోనే జగన్ ప్రభుత్వం ఖర్చుచేయడం విశేషం. సచివాలయాల వారీగా పరిశీలిస్తే కనుపర్తిలో అభివృద్ధి రూ.12.53 కోట్లు, సంక్షేమం రూ.22.2 కోట్లు, ప్రభగిరిపట్నంలో అభివృద్ధి రూ.9.25 కోట్లు, సంక్షేమం రూ.19.34 కోట్లు, తోడేరులో అభివృద్ధి రూ.25.44, సంక్షేమం రూ.27.73 కోట్లు, బత్తులపల్లిలో అభివృద్ధి రూ.7.81 కోట్లు, సంక్షేమం రూ.9.27 కోట్లు, బిరదవోలులో అభివృద్ధి రూ.17.49 కోట్లు, సంక్షేమం రూ.29.8 కోట్లు, డేగపూడిలో రూ.7.39 కోట్లు, సంక్షేమం రూ.12.36 కోట్లు, దుగ్గుంటలో అభివృద్ధి రూ.15.19 కోట్లు, సంక్షేమం రూ.21.75 కోట్లు, ఇనుకుర్తిలో అభివృద్ధి రూ.15.74, సంక్షేమం రూ.23.36 కోట్లు, మరుపూరులో అభివృద్ధి రూ.16.52 కోట్లు, సంక్షేమం రూ.21.97 కోట్లు, మహ్మదాపురంలో అభివృద్ధి రూ.12.4 కోట్లు, సంక్షేమం రూ.19.49 కోట్లు, మొగళ్లూరులో అభివృద్ధి రూ.8.24 కోట్లు, సంక్షేమం రూ.15.09 కోట్లు, నావూరులో అభివృద్ధి రూ.17.18 కోట్లు, సంక్షేమం రూ.25.83 కోట్లు, నేదురుమల్లిలో అభివృద్ధి రూ.12.58 కోట్లు, సంక్షేమం రూ.19.59 కోట్లు, పొదలకూరు(నాలుగు సచివాలయాలు)లో అభివృద్ధి రూ.73.36 కోట్లు, సంక్షేమం రూ.99.86 కోట్లు, ఆర్‌వైపాళెంలో రూ.8.82 కోట్లు, సంక్షేమం రూ.13.95 కోట్లు, సూరాయపాళెంలో రూ.5.29 కోట్లు, సంక్షేమం రూ.12.37 కోట్లు, తాటిపర్తి(రెండు సచివాలయాలు)లో అభివృద్ధి రూ.24.94 కోట్లు, సంక్షేమం రూ.39.03 కోట్లు, వావింటపర్తిలో అభివృద్ధి రూ.14.1 కోట్లు, సంక్షేమం రూ.19.8 కోట్లు, విరువూరులో అభివృద్ధి రూ.14.58 కోట్లు, సంక్షేమం రూ.20.27 కోట్ల నిధులు వెచ్చించారు.



ఆస్పత్రికి వెళ్లి వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్(ఫైల్)



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి(ఫైల్)

ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి



ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ఎన్నడూ జరగలేదు. మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతో శ్రమపడి గ్రామాల్లో పనులు పూర్తి చేయించారు. అధికారులు సైతం కష్టపడి పనులను సకాలంలో చేయించగలిగారు.

– పి.శ్రీనివాసులురెడ్డి, నల్లపాళెం

ప్రతి కుటుంబానికి మేలు



ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పొదలకూరు మండలంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధిపొందింది.

– టి.పెంచలనాయుడు, నేదురుమల్లి

క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మండలంలోని పార్లపల్లి, చెర్లోపల్లి, బిరదవోలు, ముత్యాలపేట, కల్యాణపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాల్సిందిగా సూచించారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



మైపాడులో ఇంటికి వెళ్లి వ్యాక్సినేషన్‌పై ఆరాతీస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఇందుకూరుపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, రోగులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని మైపాడు, జగదేవిపేట ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు గ్రామంలోని పలువురు ఇళ్లను సందర్శించారు. వ్యాక్సినేషన్‌పై ఆరాతీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, కిశోర్, బ్రహ్మనాయుడు, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

8న విడవలూరులో జాబ్ మేళా

విడవలూరు : స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీ సోమవారం జేకేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత గురువారం తెలిపారు. ఇందులో హీరో, నియోలింక్ సెటాప్ బాక్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 10 గంటలకు రెజ్యూమ్, ఆధార్, పాస్ ఫొటోలతో ఇంటర్వ్యూకు రావాలని కోరారు. ఇతర వివరాలకు 77806 92460, 86395 34650 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

చంద్రబాబు కుట్రలకు వృద్ధుల బలి

కోవూరు : చంద్రబాబు కుట్రలకు వృద్ధులు మరణిస్తున్నారని డీఏఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వేగూరు మజరా వసంతపురానికి చెందిన తుమ్మా నరసమ్మ(80) గురువారం పింఛన్ కోసం వెళ్లి మృతిచెందడం బాధాకరమన్నారు. ఈ మేరకు ఆమె నివాసంలో మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ పింఛన్ల పంపిణీతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో గ్రామ, వార్డు వలంటీర్లను దూరం చేయడం కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. కాగా విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆమె కుటుంబానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, గున్నం అనిల్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం సాగింది. మహిళా భక్తులు కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

అయ్యప్పనగర్‌లో..

పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వీరి చలపతిరావు

కోవూరు(కొడవలూరు) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం కావలిలో నిర్వహించే సిద్ధం సభను జయప్రదం చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సూచన మేరకు సిద్ధం సభను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారిగా జిల్లాకు వస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. ప్రతిపక్ష నేతల మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి, కోడలు



ఇందుకూరుపేట: ఎన్నికల ప్రచారం చేస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ముంగిటకు తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను అమలు చేశారని, ఆయనకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురజాల బుజ్జిబాబు, వేళ్ల భానుచంద్రశేఖర్, భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, మేనాటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. ఆమె తన కోడలు పూజారెడ్డితో కలిసి గురువారం బుచ్చి నగర పంచాయతీలోని 18 వార్డు పరిధిలో పలు కాలనీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మునుపెన్నడూ జరగలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, స్థానిక కౌన్సిలర్ మోర్ల జయంతి, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మీ రుణం తీర్చుకోలేం



పొదలకూరు : చిట్టేపల్లిలో దివ్యాంగ బాలుడిని పలుకరిస్తున్న పూజిత

పొదలకూరు : మా కుటుంబంపై మీరు చూపుతున్న ప్రేమానురాగాలు అమోఘమని, ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి, ఎస్సీ, ఎస్టీకాలనీల్లో గురువారం పూజిత ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిట్టేపల్లిలో వైఎస్సార్‌సీపీకి మెజారిటీ తగ్గుతున్నా అభివృద్ధి పనులను తన తండ్రి ఎన్నడూ విస్మరించలేదన్నారు. గ్రామంలో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లను నిర్మించామన్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. పూజిత వెంట జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీలు జి.శ్రీనివాసులు, జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, వార్డు సభ్యులు అంజాద్, ఉమామహేశ్వరి, కంటే వాసు, మూలి సతీష్‌రెడ్డి, నాయకులు వెంకటరత్నంనాయుడు, ప్రసాద్‌నాయుడు, శ్రీధర్‌నాయుడు, రాధయ్య, కామాక్షయ్య, శ్రీనివాసులునాయుడు, ఆర్.గోపాలయ్య, శివాడ శ్రీనివాసులురెడ్డి, కొప్పోలు చలపవతి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ఫుల్ జోష్

- ఊరూరా ఖాళీ అవుతున్న టీడీపీ
- ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన కొడవలూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్‌లో ఉంది. మరో నెల రోజుల్లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీకి నాయకులు, కార్యకర్తలు క్యూ కడుతున్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వెల్లడిస్తున్నారు. నియోజకవర్గంలోని కోవూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాల్లోని టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని ఆ నాయకులు తెలిపారు. దీనికితోడు కోవూరు టీడీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పార్టీలో సీనియర్ నాయకులను విస్మరించి కొత్తగా చేరిన అనామక నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారు. రెండురోజుల క్రితం బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లిలో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. టీడీపీ సీనియర్ నాయకులను విస్మరించి వైఎస్సార్‌సీపీ బహిష్కరించిన సూరా శ్రీనివాసులురెడ్డిని టీడీపీలో తీసుకొచ్చి తమపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆ గ్రామ టీడీపీ నాయకులు సూరాను అడ్డుకున్న సంగతి తెలిసిందే. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో సూరా తన అనుచర వర్గంతో ప్రచారం నుంచి అర్ధాంతరంగా వెనుతిరిగారు.

కూటమిలో గుబులు

నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడుతుండటంపై కూటమిలో గుబులు రేగుతోంది. ప్రధాన అనుచరగణం పార్టీని వీడుతున్నా పార్టీ పరంగా ఎలాంటి బుజ్జగింపు చర్యలు తీసుకోవడం లేదని నాయకులు అంటున్నారు. దీనికితోడు కూటమిలో భాగమైన బీజేపీ, జనసేనలను టీడీపీ పట్టించుకోవడం లేదు. ఒంటెద్దు పోకడలతో ముందుకు సాగుతోంది. ఈ పరిణామం నాయకులు, కార్యకర్తలకు మింగుడు పడటం లేదు. వారంరోజుల క్రితం బుచ్చిరెడ్డిపాళెం టీడీపీ మండల కార్యాలయంలో కూటమి సమావేశం జరిగింది. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు రఘురామయ్యను కనీసం వేదికపైకి పిలువలేదు. దీంతో ఖంగుతిన్న ఆయన తన అనుచర వర్గంతో అక్కడి నుంచి వెళ్లిపోయి బీజేపీ కార్యాలయంలో ఈ విషయమై చర్చించారు. దీనిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

పెరిగిన వైఎస్సార్‌సీపీ బలం

టీడీపీ నుంచి ప్రారంభమైన వలసలు వైఎస్సార్‌సీపీ బలాన్ని మరింత పెంచాయి. కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం దాదాపు ఖాయమైంది. ఇప్పటికే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం, మంత్రిగా పనిచేయడం, నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామస్థాయిలో ప్రసన్నకు బలమైన క్యాడర్ ఉంది. దీనికితోడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రసన్న మరోసారి గెలవడానికి మరింత బలం చేకూర్చుతున్నాయి.

తాగునీటి చలివేంద్రం ఏర్పాటు

మనుబోలు : ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తాగునీటి చలివేంద్రాన్ని గురువారం తహసీల్దార్ చిరంజీవి ఏర్పాటు చేయించారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో కూడా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఓ గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారంతో బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన వ్యక్తి హిజ్రాగా గుర్తించారు. రెండు రోజుల క్రితం మృతిచెంది ఉండొచ్చని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పొందిన మౌలాలీని అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం : వీఎస్‌యూ పరిశోధక విద్యార్థి మౌలాలీకి వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. నెల్లూరు నగరంలోని సంతపేటకు చెందిన మౌలాలీ వీఎస్‌యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మధుమతి పర్యవేక్షణలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఇంటర్‌వెన్షన్స్ టువర్డ్స్ ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ పీపుల్ ఏ స్టడీ ఇన్ నెల్లూరు డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన చేశారు. మౌలాలీ పరిశోధనలు పలు జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్స్‌లో ప్రచురితం కావడంతో వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మౌలాలీని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, సోషల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మధుమతి తదితరులు అభినందించారు.

వీఎస్‌యూ ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ సునీత

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ కె.సునీతను నియమించినట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ కె.సునీతను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అనుమతితో వీఎస్‌యూ ఆర్ట్స్ డీన్‌గా నియమించినట్లు తెలియజేశారు.